కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాట 19, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 40, కాకర 52, బీర 40, క్యాబేజీ 18, ఫ్రెంచ్‌బీన్స్ 35, క్యారెట్ 35, దొండ 28, చిక్కుడు 50, గోకర 45, బీట్‌రూట్ 17, క్యాప్సికం 65, ఆలు 21–25, దోస 28, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 33–50. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్

చాదర్‌ఘాట్: జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ప్రతి సమస్యపై సమీక్షించడంతో పాటు వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ఏఎంసీ మురళీధర్, హర్షద్, సాబుద్దీన్ ఉన్నారు.

రోడ్డుపైనే చెత్తకుప్పలు



ప్రభాత్‌నగర్ రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

చైతన్యపురి: ఇక్కడ నిత్యం రోడ్డుపై చెత్తకుప్పలు దర్శనం ఇస్తూనే ఉంటాయి. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ సమీపంలో ఉంది ఈ స్థలం. ఇక్కడ పండ్ల వ్యాపారులతో పాటు చుట్టుపక్కల ప్రజలు చెత్త పడేస్తుంటారు. దీంతో వ్యర్థాలు పేరుకుపోయి దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ చెత్త వెయ్యకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంటలపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మలక్‌పేట: 'స్మార్ట్ లీవింగ్ ప్రోగ్రామ్'లో భాగంగా సోమవారం శ్రీ చైతన్య స్కూల్ మూసారంబాగ్ బ్రాంచ్‌లో జై కిసాన్– జై భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో స్కూల్ ఏజీఎం సతీశ్ మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముకగా నిలిచి అందరికి అన్నం పెడుతున్న రైతులను గౌరవించాలని సూచించారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పంటలపై అవగాహన కల్పించినట్టు ప్రిన్సిపాల్ భువనేశ్వరి తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ రఘువంశీ, ఆర్‌ఐ వెంకటర్‌రెడ్డి, డీన్ గిరి, ప్రైమరీ కోఆర్డినేటర్ ప్రీతి, ప్రైమరీ ఇన్‌చార్జి వరలక్ష్మి, ప్రోగామ్ ఇన్‌చార్జి స్నేహలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: మాజీ సీఎం కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను రెండు వేల నుంచి నాలుగు వేల వరకు పెంచారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి గుర్తుచేశారు. సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిందని చెప్పారు. షాదీముబారక్ పథకంలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 వేలకి లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దయానంద్ గుప్తా, యెగ్గే మల్లేశం, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సభ్యులు

లింగోజిగూడ: క్రీడలు శరీర దారుఢ్యానికి దోహద పడుతాయని రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. సుధాకర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు బీఎన్‌రెడ్డినగర్‌లో మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు సోమవారం జీఎస్టీ, సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ పద్మశ్రీతో కలిసి శ్రీనివాస్ గుప్తా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్‌రావు, యువిఎస్ బాబు, ప్రభాకర్‌రెడ్డి, రవిబాబు, ఉప్పలరెడ్డి, సంజీవ్‌కుమార్, సావిత్రి పాల్గొన్నారు.

ఐదుగురి జీవితాల్లో వెలుగులు

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ రైతు. ఇందుకు సంబంధించిన వివరాలు.. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పులిచెర్ల గ్రామానికి చెందిన రైతు మావిళ్ల సైదులు(33) ఈ నెల 5న ఉదయం 10.30కు తన ఇంట్లో కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా 7వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు సైదులు భార్య జ్యోతి ఇతర కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం సైదులు మృతదేహం నుంచి లివర్, కిడ్నీలు, కార్నియాలను వైద్యులు సేకరించారు.



మావిళ్ల సైదులు (ఫైల్)

గర్భిణులకు ఇబ్బందులు రానివ్వొద్దు



సరుకులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: అంగన్‌వాడీకి వచ్చే గర్భిణులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులకు సమయానికి ఆహారం అందించాలని కోరారు. ఆయన వెంట ఉపాధ్యాయురాలు రజిత ఉన్నారు.

వారంలో ఫిర్యాదుల పరిష్కారం

- మేయర్ గద్వాల విజయలక్ష్మి
- ఎల్‌బీనగర్‌లో 'ప్రజావాణి' పరిశీలన



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఎల్‌బీనగర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిని ఆమె పరిశీలించడంతో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో కరోనా ప్రబలడం వల్ల ప్రజావాణిని నిలిపి వేశామని చెప్పారు. తిరిగి ఈ రోజు నుంచి జీహెచ్‌ఎంసీ మొత్తం కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ నెల 22 నుంచి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కూడా ప్రజావాణి ప్రారంభిస్తామన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందులో అధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి ఉన్నాయని, ఆ తర్వాత శానిటేషన్, కుక్కల బెడద, వీధి దీపాలు, దోమల నివారణపై ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే డీసీలకు మెమోలు జారీ చేస్తాని మేయర్ హెచ్చరించారు. అనంతరం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని డీసీలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పంకజ, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ సీపీ ప్రసాద్ రావు, అధికారులు పున్న నాయక్, రజినీ ఉన్నారు.

బీఎన్‌రెడ్డినగర్‌లోని సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మిని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ కలిసి డివిజన్‌లలోని సమస్యలు వివరించారు. ప్రధానంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, దోమలు, విద్యుత్ వీధి దీపాలు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఓల్డ్‌మలక్‌పేటలో 'వికసిత్ భారత్' యాత్ర

చాదర్‌ఘాట్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర వాహనం సోమవారం ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌కు చేరుకుంది. పోచమ్మ బస్తీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేందుకు సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారు యాత్ర వాహనం వద్ద దరఖాస్తులు పొందవచ్చని సూచించారు. అనంతరం యాత్ర వాహనం వద్ద ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉపేందర్ రెడ్డి, ఎస్‌బీఐ మలక్‌పేట బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వరుణ్‌కుమార్, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, రామకోటేశ్వరరావు డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సంకల్ప్ యాత్ర వాహనం వద్ద బీజేపీ నాయకులు

వీరన్నగుట్ట బస్తీలో అక్షింతల పంపిణీ

మన్సూరాబాద్: అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణంతో హిందువుల ఆకాంక్ష సిద్ధిస్తుందని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శ్రీరాముని అక్షింతలను హయత్‌నగర్ పరిధిలోని వీరన్నగుట్ట బస్తీలో కార్పొరేటర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాల రాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా రామ నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా కొనసాగించాలన్నారు.



అక్షింతలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కార్పొరేటర్

లింగోజిగూడ: డివిజన్ పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రజానివాస్ ఫేజ్ 2 నూతన కార్యవర్గ సభ్యులను సోమవారం కార్పొరేటర్ సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు వాసవి, విజయకుమారి, శరత్‌బాబు, నరసింహ, సురేశ్, మీనా, శ్రవణ్‌గౌడ్, లక్ష్మి, నారాయణ, మాజీ అధ్యక్షుడు తిరుమల్ ఉన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమం

కొత్తపేట పరిధిలోని మోహన్‌నగర్‌లో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్ పవన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఫౌండేషన సభ్యులు ఉపేందర్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, రింకు సింగ్, రాజ్‌కుమార్, ప్రవీణ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన కలీముల్లా, గాయపడిన అన్వర్‌హుస్సేన్

హస్తినాపురం: బైక్‌పై రాంగ్ రూట్‌లో వెళ్తూ లారీని ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు.. బిహార్‌కు చెందిన కలీముల్లా(20), అన్వర్ హుస్సేన్(30) హయత్‌నగర్‌లోని ఓ టైలర్ షాపులో పనిచేస్తున్నారు. ఇద్దరూ కలిసి సోమవారం రాత్రి బైకుపై వెళ్తుండగా ఆటోనగర్ హైకోర్టు కాలనీ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో యువకులు రాంగ్ రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కలీముల్లా(20) అక్కడికక్కడే మృతి చెందగా అన్వర్ హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకొని హుస్సేన్‌ను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని కలీముల్లా మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

వివిధ కేసుల్లో నిందితులకు జైలు శిక్ష

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టు సముదాయంలో సోమవారం పలు అదనపు జిల్లా కోర్టుల్లో ఐదుగురికి జైలు శిక్షతో జరిమానా విధించారు. తలకొండపల్లి ఠాణా పరిధిలో కోర్టు ఏపీపీ డి.రఘు తెలిపిన వివరాల ప్రకారం... వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భార్యను హతమార్చిన కాటమల్ల జంగయ్య (27)కు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి హరీశ. రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో కోర్టు ఏపీపీ కస్తూరి భాయ్ తెలిపిన వివరాల ప్రకారం.. వివాహిత ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన భర్త మల్లేశ్ కుమార్(26), అత్త మనెమ్మ(45)లకు మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారు 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.భవానీచంద్ర. శాబాద్ ఠాణా పరిధిలో కోర్టు ఏపీపీ జ్యోతి రెడ్డి తెలిపిన వివరాలు.. పెళ్లైన ఆరు నెలలకే భర్త వేధించడంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో చల్లా రాజేందర్ రెడ్డి(30)కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.జయలక్ష్మి. బాలాపూర్ ఠాణా పరిధిలో కోర్టు ఏపీపీ సునిత బర్ల తెలిపిన వివరాల ప్రకారం.. బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన సయ్యద్ వాసె(45)కు 5ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా విధించారు రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి. ఇదే కేసులో బాధితురాలికి లక్ష రూపాయలు నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

ఉప్పల్ నియోజకవర్గ ఓటరు లిస్ట్ తుది జాబితా



ఉప్పల్: ఓటరు లిస్ట్ తుదిజాబితాను అధికారులు వెల్లడించారు. 2024 జనవరి 6 వరకు గల ఓటర్ల తుది జాబితా ఈ విధంగా ఉంది. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో 407 పోలింగ్ స్టేషన్లలో 5,33,149 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో పురుషులు 2,76,890 ఉండగా.. మహిళలు 2,56,221 మంది ఉన్నారు. ఇతరులు 38 మంది ఓటర్లు ఉన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో సర్కిల్ పరిధిలో 236 పోలింగ్‌స్టేషన్లలో 1,61,262 పురుషులు, 1,49,624 మంది మహిళా ఓటర్లు, ఉప్పల్ సర్కిల్‌లో 171 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 1,15,628 మంది పురుషులు, 1,06,597 మంది మహిళలు ఉన్నట్లు వివరించారు. సర్వీస్ ఓటర్లు 158 మంది తమ ఓటును నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజ ప్రగతి

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం



సిబా అవార్డులను అందజేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హబ్సిగూడ: మహిళలు ఔత్సాహిత పారిశ్రామికవేత్తలుగా ఎదిగితేనే సమాజం పురోగమనం సాధిస్తుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. 'సౌత్ ఇండియా ఇన్ఫ్లూన్సెర్స్ అండ్ బ్లాగర్స్' అవార్డు ప్రధానోత్సవం సోమవారం హబ్సిగూడ వీధి నెంబర్–4 సౌత్ ఇండియా బ్రైడల్ మెకప్ అండ్ మోడలింగ్ స్టూడియో ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వకుళాభరణం హాజరై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, లక్ష్యం దిశగా ఏ రంగాల్లోనైనా జీవితంలో పురోగమించడం అసాధ్యం కాదన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ.. కాలంవృధా చేసుకోవద్దని స్వయంకృషితోనే రాణించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, మిస్సెస్ ఆసియా పసిఫిక్ సుధాజైన్, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి నవ్యారావు, వ్యక్తిగత వికాస నిపుణురాలు ప్రొఫెసర్ సీహెచ్.రేఖారావు, బ్యూటీషియన్ ప్రీతి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

షాలోం మందిరంలో ఘనంగా ఆరాధనలు

మలక్‌పేట: మూసారంబాగ్‌లో షాలోం టెంపుల్ నూతన మందిర ప్రతిష్ట ఆరాధన ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ డాక్టర్ పి.సాలోమన్ జోబ్స్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యేసుక్రీస్తు చూపించిన మార్గం అనుసరణీయం అన్నారు. తర్వాత క్రైస్తవులకు ప్రభుత్వ క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. చివరిగా చర్చి సభ్యులు పాస్టర్ దంపతులను సన్మానించారు.



పాస్టర్ జోబ్స్ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

మలక్‌పేటలో 13 నుంచి ప్రత్యేక కూడికలు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ ఆంధ్రా కాలనీ, ముంతాజ్ కాలేజ్ సమీపంలో ఉన్న హోరేబు ఆరాధన మందిరంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రత్యేక కూడికలు జరుగుతాయని పాస్టర్ బ్రదర్ జాన్, చర్చి పెద్దలు మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటలకు బైబిల్ పఠనం, సాయంత్రం 6.30 గంటలకు సువార్త కూడిక, ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు యవ్వనస్థుల కూడిక ఉంటుందన్నారు. బ్రదర్ హనోక్ సేన్(యూఎస్‌ఏ షికాగో) దైవ వర్తమానం అందిస్తారని తెలిపారు.

13 నుంచి మల్లన్నస్వామి జాతర



కరణ్‌బాగ్ ఆలయంలోని బలిజ మేడలాదేవి, శ్రీ గొల్లకేతమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి

సైదాబాద్: కరణ్‌బాగ్ మల్లన్నస్వామి జాతర ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆలయంలో విలేకరులు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. మూడురోజుల పాటు సాగే వేడుకల్లో మొదటి రోజు తెల్లవారుజామున స్వామివారి మేలుకొలుపు, అభిషేకం, బిల్వార్చనలు కొనసాగుతాయని చెప్పారు. అదే రోజు సాయంత్రం గంగతెప్ప, మల్లన్నస్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం శ్రీ బలిజ మేడలాదేవి, శ్రీ గొల్ల కేతమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం జరుగుతుందని, అదే రోజు మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని చెప్పారు. సాయంత్రం పటం, అగ్నిగుండాలు, గొలుసు తెంపడం కార్యక్రమాలు ఉంటాయన్నారు. చివరి రోజు రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ, మహంకాళి అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తామన్నారు. జాతర ముగింపు రోజున భక్తులకు వడి బియ్యం, ముత్తయిదువులకు పసుపు కుంకుమ, గాజులు అందజేస్తామని సత్యనారాయణ తెలిపారు.

కళాప్రదర్శనల్లో తెలుగువారి ప్రతిభ అద్భుతం

సైదాబాద్: కళాప్రదర్శనల్లో తెలుగువారి ప్రతిభ అద్భుతమని వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి కొనియాడారు. సంక్రాంతిని పురస్కరించుకొని హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియాతో కలిసి వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్మీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కూచిపూడి, కవితా పోటీలు నిర్వహించారు. కూచిపూడి నృత్య గురువులు సౌందర్య, అరుణ, ప్రజ్ఞ, అర్చన, ఉషారాణి, సంతోషి, ప్రవల్లిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. సంక్రాంతి సరదాలు అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీల్లో వర్ధమాన కవులు కవితలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నృత్య కళాకారిణి డాక్టర్ పి.ప్రవీణ, టీవీ శిరీష వ్యవహరించారు. విజేతలకు నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలు అందజేసారు. కార్యక్రమంలో గాయని వై.కామేశ్వరీ, స్వామి వారి ఆలయ డైరెక్టర్లు ఎస్.ప్రసాదరావు, సాయిరామ్ పాల్గొన్నారు.



కళాకారులతో ట్రస్ట్ ప్రతినిధులు

కుమ్మరి చేతి వృత్తిదారులను ఆదుకోవాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

చంపాపేట: కుమ్మరి చేతి వృత్తిదారుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర కుమ్మరి సంఘ అధ్యక్షుడు నడికుడి జయంతరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అనంతరం జయంతరావు మాట్లాడుతూ కుమ్మరి చేతివృత్తిదారులకు ఆధునిక యంత్రాలతో ప్రత్యేక వృత్తి శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇలా తయారు చేసిన మట్టి పాత్రలు, కుండలు విక్రయించేందుకు ప్రత్యేక మార్కెట్‌ను సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. తమ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు జయంతరావు చెప్పారు. మంత్రిని కలసిన వారిలో సంఘ ప్రతినిధులు మల్కాజిగిరి దయానంద్, ఆమంచి రాజలింగం, శ్రీనివాస్, గోవర్ధన్, వీరయ్య, శంకర్, వెంకటేశ్, కిష్టయ్య తదితరులున్నారు.



హస్తినాపురంలో..



శ్రీరమణకాలనీలో రోడ్డుపైనే మురుగు

రోడ్లపైనే మురుగు

ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని అనేక ప్రాంతాలలో రోడ్లపైనే డ్రైనేజీ పొంగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హస్తినాపురం డివిజన్ శ్రీరమణకాలనీలో కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. వనస్థలిపురం దగ్గరా ఇలాంటి సమస్యే ఉంది. - హస్తినాపురం

నాలాపై అక్రమ నిర్మాణం

మన్సూరాబాద్: వరదకాల్వ నాలాపై అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మన్సూరాబాద్ సర్వే నంబర్ 8, 9లో సౌత్ ఎండ్ పార్కు కాలనీలో ఒక వరదనీటి కాల్వ చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రధానమైంది. పైకాలనీలైన సహారా ఎస్టేట్స్, హిమపురికాలనీ నుంచి వచ్చే వరదనీరు ఈ నాలా గుండా సౌత్ ఎండ్ పార్కు నుంచి డబుల్ బెడ్‌రూం వరకు వెళుతుంది. అయితే, సౌత్ ఎండ్ పార్కు కాలనీ వద్ద ఓ నిర్మాణదారుడు వరదకాల్వ మధ్యలో నిర్మాణం చేపట్టాడు. దీనిపై కాలనీవాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హయత్‌నగర్ ఇంజినీరింగ్ ఈఈ రమేశ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావనీ, సెక్షన్ ఆఫీసర్ మన్సూర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ మేరకు నిర్మాణదారుడికి ఇంటి డాక్యుమెంట్స్‌తో పాటు అనుమతి పత్రాలు అందజేయాలని నోటీసులు జారీ చేశారు.



సౌత్‌ఎండ్ పార్కు కాలనీ వద్ద నాలాపై నిర్మాణం



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిరంతర కృషితోనే విజయాలు సాధ్యం

రామంతాపూర్ : అరోరా పీజీ కళాశాలలో టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోర్సులను అందించేందుకు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో నిరంతర కృషి తపనతో ఎన్నో విజయాలు సాధించవచ్చన్నారు. టెక్స్ అకాడమీ మేనేజర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. కోర్సు పూర్తి కాగానే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎంసీఏ, ఎంబీఏ విభాగాధిపతులు డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ దేవేందర్‌రావు పాల్గొన్నారు.

